సాక్షి
కుమురం భీం

ఆదివారం । 30 । మార్చి । 2025



తెలుగుదనం ఉట్టిపడేట్టు 8లో▸

తరాలు మారినా ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సంప్రదాయం వీడడంలేదు. వృత్తి ఏదైనా పంచెకట్టుతో లీవీగా కనిపిస్తున్నారు.



శివుని సన్నిధిలో ఉగాది 9లో▸

కెరమెరి మండలంలోని శంకర్‌లొద్ది ఉగాది పర్వదినాన జనసంద్రం కానుంది. ఉమ్మడి జిల్లా నుంచి సేవాలాల్ భక్తులు తండోపతండాలుగా ఇక్కడికి తరలిరానున్నారు.

గరిష్టం/కనిష్టం
38.0 /24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తు గడువు పెంపు

రెబ్బెన: రిటైర్డ్ ఉద్యోగుల కోసం రూపొందించిన సీపీఆర్‌ఎంఎస్ హెల్త్‌కార్డు దరఖాస్తు గడువు ఈ నెల 31నుంచి ఏప్రిల్ 15వరకు పెంచినట్లు బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఏరియాలోని రిటైర్డ్ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్ణీత గడువులోపు తాము పని చేసిన గనులు, డిపార్ట్‌మెంట్‌లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఎంపిక

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు బోధించేందుకు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఎంపిక చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. శనివారం కళాశాలలో సహాయ ప్రొఫెసర్ల ఎంపిక కోసం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎంహెచ్‌వో సీతారాం, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మితో కలిసి ఇంటర్వ్యూ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వైద్య కళాశాలల ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది నియామకానికి చర్యలు చేపడుతోందని తెలిపారు. అనంతరం కళాశాలలోని వివిధ బ్లాక్‌లను పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కళాశాల ప్రొఫెసర్లు, సిబ్బంది ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న యువరాజ

ఆసిఫాబాద్: పాఠశాల విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ కే యువరాజ సూచించారు. జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థులకు నూతన చట్టాల గురించి వివరించారు. మహిళల రక్షణకు 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని స్పెషల్ సబ్ జైలును సందర్శించి ఖైదీల సమస్యలు తెలుసుకున్నారు. ప్రైవేట్ న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని ఖైదీలు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పూదరి నరహరి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్వర్లు, అంజనీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పంచాంగం' ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హన్మాన్ మందిర్ ఆవరణలో శనివారం ధూప దూప నైవేద్యం అర్చక సంఘం ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర పంచాంగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్చక సంఘం అధ్యక్షుడు శిరీశ్, సభ్యుడు ఢిల్లీ విజయ్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 114 మందికి ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల కోసం గత సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకం ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో అదనంగా తులం బంగారం ఇస్తామని ప్రకటించి విస్మరించిందని విమర్శించారు. తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, బీఆర్‌ఎస్ నాయకులు అలీబిన్ అహ్మద్, రవీందర్, భీమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏడిపిస్తున్న ఎర్రబంగారం



నాగపూర్ మార్కెట్‌లో చింతలమానెపల్లి మండల మిర్చి రైతులు

- ఒక్కో రైతుకు రూ.లక్షల్లో నష్టం
- మహారాష్ట్రకు పంట తరలింపు
- భారమవుతున్న రవాణా ఖర్చు
- పెట్టుబడి కూడా రాని పరిస్థితి
- మార్కెట్ లేక తప్పని తిప్పలు



ఇతడు చింతలమానెపల్లి మండలం రణవెల్లికి చెందిన జాటోత్ సోమేశ్. తనకున్న ఐదెకరాలతోపాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేయగా 180 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇక్కడ మార్కెట్ సౌకర్యం లేక పంటను నాగపూర్ మార్కెట్‌కు తీసుకువెళ్లాడు. ఇందుకు రవాణా ఖర్చులు క్వింటాల్‌కు సుమారు రూ.1,400 అయ్యాయి. మార్కెట్‌లో రూ.11వేల ధర పలికింది. రవాణా ఖర్చులు పోను ఈ రైతుకు క్వింటాల్‌కు రూ.9,500 మాత్రమే మిగిలింది. పెట్టుబడి, కూలీల ఖర్చులు పోనూ ఇతనికి మిగిలింది నష్టమే. 20 ఎకరాలకు ఇతడు పెట్టిన పెట్టుబడి రూ.30లక్షలు కాగా, పంట అమ్మగా ఖర్చులు పోనూ రూ.22లక్షలే మిగిలాయి. దీంతో ఈ రైతు రూ.8లక్షలు నష్టపోయాడు.

ఇది ఈ ఒక్క రైతు పరిస్థితి కాదు. జిల్లా వ్యాప్తంగా మిర్చి సాగు చేసిన రైతులందరిది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో ప్రధానంగా పత్తి, వరి, కంది సాగు చేస్తారు. ఇతర వాణిజ్య పంటలకు ప్రోత్సాహం లేకున్నా రైతులు ప్రయోగాత్మకంగా, సొంతంగా ఏర్పాటు చేసుకున్న నీటి వనరుల సహాయంతో పసుపు, పండ్ల తోటలు, కూరగాయలు, మిర్చి, పొద్దుతిరుగుడు, వేరుశనగ సాగు చేస్తున్నారు. కానీ.. జిల్లాలో మార్కెట్ యార్డులు లేక 'మద్దతు' దక్కక మిర్చి రైతులు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

చింతలమానెపల్లి: జిల్లాలో ఏటా మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. రెండేళ్ల క్రితం కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 2,100 ఎకరాల్లో సాగు కాగా, ఈసారి ఒక్క కౌటాల మండలంలోనే సుమారు 2వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. పత్తి, సోయాతో పోలిస్తే మిర్చి లాభసాటిగా ఉంటుందని రైతులు భావించారు. చింతలమానెపల్లి మండలంలో సుమారు 800 ఎకరాలు, బెజ్జూర్‌లో 400, పెంచికల్‌పేట్‌లో 600, దహెగాంలో 800 ఎకరాలు, సిర్పూర్ మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో మిర్చి సాగవుతున్నట్లు అంచనా. కాగజ్‌నగర్ డివిజన్‌తో పోలిస్తే ఆసిఫాబాద్ డివిజన్‌లో సాగు విస్తీర్ణం తక్కువగా ఉంది.

రైతుకు దక్కని 'మద్దతు'

మూడేళ్ల క్రితం కౌటాల మండలం తాటిపల్లి గ్రామ రైతులు మిర్చి సాగు చేసి లాభాలు గడించారు. అప్పుడు వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించి రైతులను ప్రోత్సహించారు. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మిర్చి పంటకు వస్తున్న ఆదరణతో కౌటాలతో పాటు జిల్లా వ్యాప్తంగా సాగు పెరిగింది. అయినా రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడింది. గతేడాది క్వింటాల్‌కు రూ.20వేలు ఉండగా.. ఒక్కో రైతుకు నాణ్యమైన పంటకు రూ.15వేల నుంచి రూ.18వేల ధర లభించింది. ప్రస్తుతం రూ.12వేలు పలుకుతోంది. నాగ్‌పూర్, వరంగల్ మార్కెట్‌లలో రూ.8వేల నుంచి రూ.11వేలు మాత్రమే ఉంది. మిర్చి సాగుకు ఎకరాకు రూ.లక్షా 20వేల వరకు ఖర్చవుతుండగా కనిష్టంగా 9 క్వింటాళ్లు.. గరిష్టంగా 12క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ఈలెక్కన రైతుకు పెట్టుబడి కూడా దక్కడం లేదు.

మహారాష్ట్రకు తరలింపు

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో మిర్చి సాగు చేసిన రైతులు పంటను విక్రయించుకునేందుకు మహారాష్ట్రకు తరలించాల్సి వస్తోంది. స్థానికంగా పండించే పంట నాణ్యతతో ఉన్నా స్థానికంగా మార్కెట్ వసతి లేక మహారాష్ట్రలోని నాగ్‌పూర్, ఇంగన్‌ఘాట్ తదితర ప్రాంతాలకు పంటను తరలిస్తున్నారు. అక్కడ దళారులు ఇచ్చిన ధరకే విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అక్కడినుంచే రిటైల్ వ్యాపారులు మిర్చి కొనుగోలు చేసి ఇక్కడి మార్కెట్‌లో వినియోగదారులకు విక్రయిస్తున్నారు.

ఖర్చులు పెరుగుతున్నాయి



జిల్లాలో మిర్చి పంటను అమ్ముదామంటే మార్కెట్ యార్డు లేదు. నాగ్‌పూర్ లేదా వరంగల్‌కు తరలించాలి. ఇందుకు రవాణా ఖర్చులు క్వింటాల్‌కు రూ.1,200 అవుతున్నాయి. దీంతో మేము నష్టపోవాల్సి వస్తోంది.

– మొర్లె గణపతి, బూరెపల్లి, చింతలమానెపల్లి

ప్రభుత్వం పట్టించుకోవాలి



మిర్చి రైతులకు మద్దతు ధర ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆదిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో నష్టపోయిన రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. మద్దతు ధర ఇవ్వకుండా రైతు ప్రభుత్వమని ఎందుకు చెప్పుకొంటున్నారు.

– తెలిగె మల్లేశ్, ఒడ్డుగూడెం, దహెగాం

'మోడు' నీడలో..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న చెట్టు కెరమెరి మండలంలోని దేవుడ్‌పల్లి పునరావాస కేంద్రం సమీపంలోనిది. నిత్యం మేత మేసిన తర్వాత పశువులు ఈ చెట్టు నీడన కాసేపు సేద తీరుతాయి. అయితే.. కొద్దిరోజుల క్రితమే ఆకులన్నీ రాలి చెటతిలా మోడులా మారింది. అయినా అలవాటు ప్రకారం మూగజీవాలు ఈ చెట్టు నీడన సేద తీరుతూనే ఉన్నాయి. - కెరమెరి

సర్వర్ డౌన్..!

- రెండ్రోజులుగా మొరాయింపు
- సర్టిఫికెట్ల జారీకి ఆటంకం
- ఆఫీసుల్లో అర్జీదారుల నిరీక్షణ
- వరుస సెలవులతో ఆందోళన



రెబ్బెన తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుదారులు

రెబ్బెన: రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు నిరుద్యోగ యువత పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ పథకం కింద రూ.50 వేల నుంచి రూ.4లక్షల వరకు స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన వారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. కాగా, ఇందుకు కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు అవసరం కాగా నిరుద్యోగులు మీసేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తుండటంతో మీసేవా కేంద్రాల నిర్వాహకులు, రెవెన్యూ సిబ్బందికి తలకు మించిన భారమవుతోంది.

మొరాయిస్తున్న సర్వర్

కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల జారీ కోసం రెవెన్యూ సిబ్బంది వినియోగించే సర్వర్ రెండు రోజులుగా మొరాయిస్తోంది. దీంతో ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఒక్క చింతలమానెపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సుమారు 900కు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దీంతో దరఖాస్తుదారులు సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు గడువు ఏప్రిల్ 5తో ముగియనుంది. వరుసగా ఆది, సోమ, మంగళవారాలు సెలవు దినాలు కావడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గడువులోపు సర్టిఫికెట్లు అందుతాయో లేదోనని అయోమయానికి గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆందోళన చెందుతున్న వీరు దరఖాస్తు గడువు పొడిగించాలని కోరుతున్నారు.

సర్వర్ డౌన్ అవుతోంది



కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల జారీకి సర్వర్ డౌన్ అడ్డంకిగా మారింది. రెండు రోజులుగా మొరాయిస్తుండగా సర్టిఫికెట్ల జారీ ఆలస్యమవుతోంది. ఆపరేటర్ గంటలకొద్దీ కూర్చున్నా రోజుకు 10 సర్టిఫికెట్లు కూడా పూర్తి కావడం లేదు. వరుస సెలవులున్నా కూడా ఆపరేటర్‌ను అందుబాటులో ఉంచి సర్టిఫికెట్లు జారీ చేస్తాం.

– రామ్మోహన్‌రావు, రెబ్బెన తహసీల్దార్

ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి


- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని జాతీయ రహదారి, ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పట్టణాల్లో ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వేగ నియంత్రణలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మంచిర్యాల నుంచి వచ్చే దారిలో ఆసిఫాబాద్ ముఖద్వారం వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని, పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన తరగతులు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంకెన్‌డ్రైవ్, విస్తృతస్థాయిలో తనిఖీలు చేపట్టాలని, ద్విచక్రవాహనదారులంతా విధిగా హెల్మెట్ ధరించాలని, కారు ఇతర వాహనాల డ్రైవర్లు సీట్‌బెల్ట్ ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడపకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రహదారులపై ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించేలా అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించాలని, జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్‌రోడ్డుతో పాటు డ్రైనేజీలు నిర్మించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి రాంచందర్, రోడ్డు, భవనాల శాఖ అధికారి సురేందర్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శేషారావు, డీపీవో భిక్షపతి, డీఆర్డీవో దత్తారావు, డీఎంహెచ్‌వో సీతారాం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళాకారులకు అవకాశం కల్పించాలి



కళాకారులతో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలోని కళాకారులకు టీవీ, సినిమా రంగాల్లో అవకాశం కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత్ కల్చరల్ అకాడమీ, ఓం సాయితేజ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సంయుక్తంగా జిల్లాలోని వివిధ రంగాల కళాకారులకు టీవీ, సినీ రచయితలు, దర్శకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుల్లితెర దర్శక, నిర్మాత నాగబాల సురేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో కళాకారులు, క్రీడాకారులకు కొదువలేదని, కళాకారులు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో టీవీ సీరియళ్లు, సినిమా షూటింగ్‌లకు అనువైన ప్రదేశాలు చాలా ఉన్నాయని తెలిపారు. ప్రాచీన దేవాలయాలు, జలపాతాలు, సింగరేణి గనులు, సిర్పూర్ పేపర్‌మిల్లు, ప్రాణహిత, పెద్దవాగు పరీవాహక ప్రాంతాలు, కొమురంభీమ్ ప్రాజెక్ట్ లాంటి సుందరమైన ప్రదేశాలున్నాయని పేర్కొన్నారు. జిల్లా కళాకారులు చిత్ర పరిశ్రమలో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. టీవీ సీరియల్ దర్శకుడు ప్రేమ్‌రాజ్, నవజ్యోతి సంస్థ ప్రతినిధులు డీ రామారావు, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ, రాధాకృష్ణాచారి, బిట్టు వెంకటేశ్వర్లు, సునీల్, సంతోష్ తదితరులున్నారు.

నాడీ పట్టే నాథులేరి?

- పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత
- రోగులకు అందని వైద్యం
- ప్రైవేట్‌కు వెళ్తున్న పేదలు



కౌటాల పీహెచ్‌సీలో ఖాళీగా వైద్యుడి కుర్చీ

కౌటాల: వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగినందున ప్రజలు వడదెబ్బతోపాటు వివిధ అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదముంది. ఈ సమయంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు తప్పకుండా అందుబాటులో ఉండాలి. కానీ.. పీహెచ్‌సీల్లో వైద్యులు లేక పల్లె ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందడం లేదు. ఏఎన్‌ఎంలే రోగులను చూసి మందులు రాసిస్తున్నారు. పరిస్థితి ఏమాత్రం అటు.. ఇటుగా ఉన్నా.. పట్టణ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. సర్కారు ఆస్పత్రుల్లో పరీక్షలు చేసే విలువైన యంత్రాలు ఉన్నప్పటికీ సంబంధిత సిబ్బంది లేక అలంకారప్రాయంగా మారాయి. ఈ నేపథ్యంలో వైద్యం కోసం అప్పు చేసి, ప్రైవేట్‌కు వెళ్లడం లేదా దేవుడిపై భారం వేసే పరిస్థితులు నెలకొంటున్నాయి. మరోవైపు డీఎంహెచ్‌వో పోస్టు ఇన్‌చార్జులతోనే నెట్టుకువస్తున్నారు.

అందని ప్రభుత్వ వైద్యం

జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్(టి) సీహెచ్‌సీ (సామాజిక ఆరోగ్య కేంద్రాలు) ఉన్నాయి. తిర్యాణి, జైనూర్, కాగజ్‌నగర్, బెజ్జూర్ ఆస్పత్రులనూ సీహెచ్‌సీలుగా మార్చారు. జిల్లాలో 20 పీహెచ్‌సీలున్నాయి. కొన్ని పీహెచ్‌సీల్లో వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో సీహెచ్‌సీలో తొమ్మిది మంది వైద్యులుండాలి. కానీ.. ఒకరిద్దరితోనే నెట్టుకొస్తున్నారు. అలాగే జిల్లాలోని కౌటాల, కెరమెరి, సిర్పూర్(యూ), లింగాపూర్, రవీంద్రనగర్ పీహెచ్‌సీల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలా ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది సమయపాలన సరిగా పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియదని స్థానికులు చెబుతున్నారు. ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులే పెద్ద దిక్కుగా మారి, రోగులకు చికిత్స చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతీరోజు రోగులు వస్తుంటారు. కానీ.. వైద్యులు లేక బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీల్లో వైద్యులు లేక అమాయక ప్రజలు వైద్యం కోసం ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వచ్చీరాని వైద్యంతో వారు రోగులతో ఆడుకుంటున్నారు. ఆర్‌ఎంపీల వైద్యం కారణంగా జిల్లాలో పలువురు మృతి చెందిన ఘటనలున్నాయి.

నర్సులే పెద్ద దిక్కు

కౌటాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యుడు లేక వైద్యశాఖ అధికారులు రిటైర్డ్ వైద్యుడిని నియమించగా కొద్ది నెలలుగా విధులు నిర్వహించారు. కానీ.. నెల క్రితం అతడిని విధుల నుంచి తొలగించారు. దీంతో స్టాఫ్ నర్సులే అన్నీ తామై వైద్యం చేస్తున్నారు. కౌటాల ఫార్మసిస్ట్ పోస్టు కూడా ఖాళీగా ఉండగా రోగులకు తిప్పలు తప్పడం లేదు. సమీప మండలాలకు కౌటాల పీహెచ్‌సీయే దిక్కు. ముఖ్యంగా కౌటాల పీహెచ్‌సీకి నిత్యం 70 నుంచి 100 వరకు ఓపీ ఉంటుంది. దీంతో వైద్యులు సక్రమంగా రాని పరిస్థితుల్లో స్టాఫ్ నర్సులే చికిత్స చేస్తున్నారు. కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు 60 నుంచి 70 వరకు సాధారణ ప్రసవాలు చేస్తారు. సాధారణ కాన్పులు అధికంగా చేయడంలో కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉంది. కానీ.. ఈ పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉంది. ప్రస్తుతం నెల రోజులుగా ఒక్కరూ లేకపోవడం విచారకరం. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యుడిని నియమించాలి



కౌటాల పీహెచ్‌సీకి వైద్యుడు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. రోగులకు స్టాఫ్ నర్సులే వైద్యం చేస్తున్నారు. కొంత మంది ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. వారు డబ్బులు దండుకుని అమాయకులతో ఆడుకుంటున్నారు. వెంటనే వైద్యుడిని నియమించాలి.

– తిరుపతి, కౌటాల

సర్దుబాటు చేస్తాం



కౌటాల, రవీంద్రనగర్, కెరమెరి, లింగాపూర్, సిర్పూర్(యూ) పీహెచ్‌సీల్లో వైద్యులు లేరు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆదేశాలు వచ్చిన వెంటనే వైద్యులను నియమిస్తాం. ప్రస్తుతం వైద్యులు లేని చోట సర్దుబాటు చేస్తాం. ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తాం.

– సీతారాం, డీఎంహెచ్‌వో

విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి

ఆసిఫాబాద్: విద్యుత్ సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించి పరిష్కరించుకోవాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రాథోడ్ శేషారావు శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ అవకాశం 24/7 అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్, విద్యుత్ సరఫరాలో అంతరాయం, బిల్లులు హెచ్చుతగ్గులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పుతో పాటు అన్ని రకాల కొత్త సర్వీసుల మంజూరుకు టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉగాది అంటే..



పండుగ అంటే ఆనందాన్ని పంచాలి
పండుగ అంటే ఐక్యతను పెంచాలి
పండుగ అంటే సంస్కృతిని నేర్పాలి
పండుగ అంటే ఆచారాలను పాటించాలి
ఉగాది అంటే షడ్రుచులకే కాదు..అన్నీ ఆదులే..
కొత్త రుతువు.. కొత్త నెల.. కొత్త పక్షం.. కొత్త తిథి
జీవితాన్ని మళ్లీ మళ్లీ ప్రారంభించాలని తెలుపుతుంది
అన్నింటిని సమానంగా తీసుకోవాలని తెలుపుతుంది
జీవితంలో అన్నీ ఉంటాయని తెలుపుతుంది
జీవితంలో అన్నీ భరించాలని తెలుపుతుంది
జీవితానికి మనోధైర్యాన్ని ఇస్తుంది
ఇది అసలైన సంప్రదాయ పండుగ

– నోముల చంద్రశేఖర్, టీటీడీ ధర్మకార్య (అధ్యాపకుడు)
దహెగాం సేకరణ: దహెగాం

ఉగాది సౌభాగ్యం



ఆకులన్నీ రాలిపోయి కొత్త చిగురు మొలిచి
బాధలన్నీ మాసిపోయి సంతోషం చిగురై నిలిచే
వచ్చే వచ్చే వసంతమై వసుధకు వన్నెలు అద్ది
ఊరంతా ఉగాదియై ఉత్సాహం ఊపులద్ది
చెట్లన్నీ చిగురు తొడిగి విశ్వావసును స్వాగతించే
మామిడాకు తోరణమై గుమ్మానికి ముందు నిలిచే
నేడే ఉగాది పర్వదినం విశ్వావసు నామవత్సరం
రైతన్నలు ఆరుకుంటూ అరకలతో అడుగులేసే
ఆరు రుచుల కలయిక అద్యంతం రసభరితం
నవరసాల మిశ్రమం పంచాంగాల శ్రవణం
కష్టసుఖాల జీవితం మంచి చెడుల సందేశం
మాధుర్యం మన సంప్రదాయం అంబరాల
సంబరం

రచన: ముత్తే వెంకటేశ్, రచయిత తెలుగు పండిత్, బెల్లంపల్లి
సేకరణ: బెల్లంపల్లి

- ఆహార్యంలో పంచకట్టు ఠీవీ..
- ప్రత్యేకత చాటుకుంటున్న ఉమ్మడి జిల్లా వాసులు

తెలుగుదనం ఉట్టిపడేట్టు



పంచకట్టు.. సంప్రదాయ వస్త్రధారణ. కాలంతో పాటు వస్త్రధారణ మారినా.. తెలుగుదనం ఉట్టిపడేది మాత్రం పంచకట్టుతోనే. వృత్తులు, విధులు, ఉద్యోగాల రీత్యా వస్త్రధారణ వేరుగా ఉంటుంది. అయినా ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు నేటికీ సంప్రదాయ పంచకట్టులో ఠీవీ చాటుకుంటున్నారు. సంస్కృతి, సంప్రదాయాన్ని భావితరాలకు అందిస్తున్నారు. వస్త్రధారణ ఆధారంగానే 'మాది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా'.. మేం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులం' అని చెప్పకనే చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు రైతులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు తెలుగుదనం ఉట్టిపడేలా ఇప్పటికీ తెల్లని చొక్కా, ధోవతి, కండువా ధరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తెలుగు సంస్కృతిని చాటి చెప్తున్నారు.

తెలుగులోనే సంతకం



భవాని ఆనంద్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

బోథ్: మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు భవానీ ఆనంద్ అర్లి బి గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రం బోధిస్తున్నారు. అతనికి చిన్నతనం నుండి తెలుగు భాష అంటే అభిమానం. అందరూ ఇంగ్లిష్‌లో సంతకం చేస్తున్నా తను మాత్రం 40 ఏళ్లుగా తెలుగులోనే చేస్తున్నారు. తెలుగుపై తనకున్న అభిమానం చాటుకుంటున్నారు.

పెద్దల నుంచి వస్తున్న ఆచారం



కేమ లక్ష్మణ్

తాంసి: తెలుగుదనం ఉట్టిపడేలా, నిండు గంభీరంగా కనిపిస్తున్న ఈ రైతు తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన కేమ లక్ష్మణ్. దశాబ్దాల నుంచి ప్రతీరోజు తెల్లని చొక్కా, దోవతి, కండువా ధరించి తెలుగు రైతుకు నిర్వచనంలా కనిపిస్తాడు. తమది వ్యవసాయ కుటుంబమని, తమపెద్దలు ఆచరించినట్లుగా తాను కూడా తెలుగు రైతు సంప్రదాయాన్ని కచ్చితంగా పాటిస్తూ ఉంటానని పేర్కొంటున్నాడు.

సంప్రదాయం మరవలేదు



మల్లెపూల నర్సయ్య

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన మల్లెపూల నర్సయ్య తెలుగు సంస్కృతికి అద్దంపట్టేలా 40 ఏళ్లుగా పంచెకట్టు (దోవతి) ధరిస్తున్నాడు. 1981లో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. రాజకీయాలపై మక్కువతో కాంగ్రెస్‌లో చేరి 2001, 2019లో బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఉన్నత చదువులు చదివినా రాజకీయాల్లో రాణిస్తున్నా తెలుగు సంప్రదాయ కట్టుబాట్లను ఇప్పటికీ ఆచరిస్తున్నారు.

పంచకట్టుతోనే పాఠాలు



తుమ్మల మల్లారెడ్డి

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలకు చెందిన అవిశ్రాంత తెలుగు అధ్యాపకుడు తుమ్మల మల్లారెడ్డి తెలుగుదనం ఉట్టిపడేలా పంచెకట్టు ధరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో డైట్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ 2000 సంవత్సరంలో ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఇంట్లో కూర్చోవడం ఇష్టం లేక తనకున్న జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. తెలంగాణలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు వెళ్లి విద్య–నీతి–విలువలపై పాఠాలు బోధిస్తున్నారు. తెలుగు భాషా పరిరక్షణలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు. ఈతరం మాస్టార్లు కూడా పంచెకట్టు సంప్రదాయం కొనసాగించాలని సూచిస్తున్నాడు.

ప్రకృతితో పరవశం..
'విశ్వావసు'ఉగాది పర్వం



వచ్చెను విశ్వావసుద్వర్షము
మెచ్చిన చిగురాకు లేతమేనికి సొగసున్
హెచ్చు కరోన విముక్తియో
తెచ్చే ప్రమోదము ప్రలకు
తీయని తలపుల్..
చంపకమాల..
చల్లని గాలులామనికి చైత్ర పుజాణ
నవోఢ రూపమై
మెల్లగ జేరవచ్చె మన
మేదిని మన్మధ మోహనాంగియై
పల్లవ బావ వీచికల ప్రాణము మల్లెల తావి తోడుతున్
జల్లుచు తేను చుక్కల వసంతములో
శుభక్రుద్విపాసియై..
ఉత్పలమాల..
పుల్ల కరమ్ములందు నవ భోగముతో సరసాల పాటలన్
కొల్లలు ప్రేమతోపలుకు కోయిల గాన విలాస మందునన్
పిల్లన గ్రోవిమాధురిని వెన్నుడు గోపిక లెన్ను రీతిగా
నెల్లరు కొత్తవర్షమున నింపుగని మధుమాస మందునన్..!
మత్తేభము..
సరసమ్మున్ గిలిగింత బెట్టి చనవే సైన్యంలో సేవకై
సిరిమల్లెల్ విరజాజులెల్ల తనవున్ శృంగార ముస్మంచెనే..
పరిహాసమ్మున చూడబోకు మనమున్ బాధించుకో! మన్మదా!
విరహాత్మంతతనే! వినోదమా!చొరబోకుమా!
విద్యుల్లతా చంద్రమా!
కందము..
కొత్త వర్షము హర్షమై కోయిలమ్మ..
పిలిచె మన్మద రతిజంట ప్రేమ కోసం
నిత్యసంకల్ప కాలమ్ముమెంచువిధము!!
రమ్ముశుభక్రుత్తు సుఖములనిమ్ము భువికి!!

– ఢిల్లీ విజయ్‌కుమార్‌శర్మ, ఆసిఫాబాద్ కవుల సంఘం సభ్యులు, సేకరణ: ఆసిఫాబాద్‌అర్బన్

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుధాకుర్దులో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. గ్రామంలోని పెద్దపల్లి మల్లయ్యకు చెందిన ఇంట్లో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.6 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది. ఎంపీడీవో మహేందర్, కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ సమీపంలో శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు (60) మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎరుపురంగు జాకెట్, గులాబీరంగు చీర ధరించి ఉందని, మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. తెలిసినవారు 8712656534, 8712656535 నంబర్లలో సంప్రదించాలన్నారు.















